పట్టణీకరణకు అనుగుణంగా
పాఠశాలలను విస్తరించాలి

- వచ్చే ఏడాది నుంచి ప్రీప్రైమరీ స్కూళ్లను ప్రారంభించాలి
- నోడిటెన్షన్‌ను రద్దు చేయడం కేంద్రం తప్పుడు నిర్ణయమే
- 'ఆంధ్రజ్యోతి'తో శాసనమండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి



తెలంగాణలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది.. అందుకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.. ప్రభుత్వ విద్యబలోపేతంతోనే అన్నివర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది.. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.. ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి విద్యాక మిషన్ సరైన మార్గదర్శకాలు అందిస్తుందని భావిస్తున్నా.. అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. అందుకు అనుగుణంగా పట్టణాలు,నగరాల్లో ప్రభుత్వ స్కూళ్లను విస్తరించాలి. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో 1.20లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, ములుగు జిల్లా అంతా కలిపినా లక్ష మందికి లోబడి మాత్రమే ఉన్నారు. అదేవిధంగా గ్రేటర్ వరంగల్, అన్ని కార్పొరేషన్లు, జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. గ్రామాల్లో వృద్ధులు మాత్రమే ఉంటున్న పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఈ మార్పును దృష్టిలో ఉంచుకొని పట్టణాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ స్కూళ్లను అదనంగా ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వరంగంలో అంగన్‌వాడీ కేంద్రాలున్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో అక్కడికంటే ప్లేస్కూళ్లకే పిల్లలను పంపుతున్నారు. ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని మేం ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

నోడిటెన్షన్ విధానం రద్దు సరికాదు

కేంద్రం తాజాగా ఇచ్చిన నోడిటెన్షన్ గెజిట్ ఇప్పుడు అవసరం లేదు. 5, 8 తరగతుల విద్యార్థులు చదువులో వెనకబడితే పరీక్షల్లో ఫెయిలయితే, ఆ విద్యార్థులపై తదుపరి తరగతిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగుపడేలా బోధన ఉండాలే తప్ప ఒత్తిడి పెంచేలా డిటెన్షన్ అమలు చేస్తామనడం అసంబద్ధ చర్య. కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంగా దీన్ని పరిగణించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అమలుచేస్తున్నట్లే నోడిటెన్షన్ విధానమే కొనసాగించాలి.

కనీసం 15మంది విద్యార్థులకు తగ్గకుండా తరగతి గది

పిల్లలకు సమవయస్కులు కనీసం 15మంది ఉంటేనే వారు చదువు నేర్చుకోవడం సులభంగా ఉంటుంది. ఉపాధ్యాయుల - మిగతా 7వ పేజీలో...

● హ్యాపీ హ్యాపీ క్రిస్మస్



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చీలన్నీ ముస్తాబయ్యాయి. ఏసు రాకను ఆహ్వానిస్తూ మంగళవారం రాత్రి నుంచే చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. 8

ఎన్నికలేనా?



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో చేసిన మార్పులతో త్వరలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీ ఎన్నికల కోసం పలు సవరణలు ప్రతిపాదించ గా, చట్ట సవరణ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. ఇక గవర్నర్ ఆమోదం తెలిపితే కొత్త చట్టం అమలులోకి రానుంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న నేతల్లో అలజడి మొదలైంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి, మోత్కూరు)

» పంచాయతీరాజ్ నూతన చట్టాన్ని ప్రతిపాదించిన ప్రభుత్వం » గవర్నర్ ఆమోదమే తరువాయి » స్థానిక సంస్థల్లో మారనున్న రిజర్వేషన్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 71 మండలాలు, 1745 పంచాయతీలు, 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 31 మం డలాలు, 844 పంచాయతీలు, ఎనిమిది మునిసిపాలిటీలు ఉన్నా యి. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు, 475 పంచాయతీలు, ఐదు మునిసిపాలిటీలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 17 మండలా లు, 426 పంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. త్వరలో మునిసిపాలిటీల పదవీకాలం కూడా పూర్తికానుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రకటించడంతోపాటు ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేసేందుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసేందుకు రాష్ట్ర ఎన్నికల సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం సైతం తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహించి, మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.

పదేళ్ల రిజర్వేషన్ లేనట్టే

బీఆర్ఎస్ సర్కారు రూపొందించిన 2018-పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థాని క సంస్థలైన పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల్లో పదేళ్లపాటు (రెండు పర్యాయాలు) ఒకే రిజర్వేషన్ ఉండాలని నిబంధన విధించింది. అయితే, తాజా కాంగ్రెస్ రూపొందించి న చట్టం ప్రకారం పదేళ్ల నిబంధనను ఐదేళ్లకు మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చాలా మం ది నేతలు స్థానికసంస్థల్లో మరోసారి పోటీ చేయాలని ఆ పార్టీలోకి వలసబాట పట్టారు. అయితే ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రిజర్వేషన్లు మారనున్నాయి. దీం తో ఏగ్రామం, మండలంలో ఏ రిజర్వేష న్లు అమలవుతాయోనని నేతలు ఉత్కంఠగా ఉన్నారు.

మండలానికి ఐదు ఎంపీటీసీ స్థానాలు

ప్రతీ మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ స్థానాలు కేటాయించడం తో కొన్ని మండలాల్లో ముగ్గురు, నలుగురే ఎం పీటీసీలు ఉన్నారు. నూతన చట్టం ప్రకారం జనాభాతో సంబంధం లేకుం డా ప్రతీ మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలని ప్రభు త్వం ప్రతిపాదించింది. ఈ నిర్ణయంతో మోత్కూరు మండలంలో ఒక ఎంపీటీసీ స్థానం పెరగనుంది. 2018లో అడ్డగూడూరు మండలం ఏర్పాటు కావడం, మోత్కూరు మునిసిపాలిటీ కావడంతో మోత్కూరు మండలంలో - మిగతా 7వ పేజీలో...

రెవెన్యూ సమస్యలు వెంటనే
పరిష్కరించాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



చందంపేట మండలం గాగిళ్లపురంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

దేవరకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, భూసేకరణతోపాటు రెవెన్యూ సమస్యలు జాప్యం చేయకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. మంగళవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి' ఫిర్యాదులు, భూసేకరణకు సంబంధించిన సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డివిజన్ పరిధిలోని నక్కలగండి, పెండ్లిపాకల, ఓపెన్‌కెనాల్, డిండి రిజర్వాయర్ పనులకు భూసేకరణ, పునరావాసం వివరాలను ఆర్డీవో రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, 'ప్రజావాణి' ఫిర్యాదులను ఆమె సమీక్షించారు.

సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, చందంపేట): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించి అర్హులను గుర్తించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం చందంపేట మండలంలోని గాగిళ్లపురం, మురుపునూతల, పాతూరుతండా గ్రామాల్లో సర్వేను ఆమె తనిఖీ చేశారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదుకు యాప్‌లో నెట్‌వర్క్ సమస్య వస్తోందని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నెట్‌వర్క్ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో శ్రీలక్ష్మీ, తదితరులు ఉన్నారు.

సత్వర న్యాయం అందించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ కిట్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమర్థ సేవలతో ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేసి మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాధాన్యం, డయల్ 100, సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీరోజు డ్రంకెడ్రైవ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేసి నేరాల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలనీ, హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్, లాకప్, ఎస్‌హెచ్‌వో గది, రికార్డులను, నూతనంగా విధుల్లో చేరిన పోలీసులకు ట్రైనింగ్‌లో ఇచ్చిన కిట్‌లను తనిఖీచేశారు. ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి


శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండలో చెక్కులు పంపిణీచేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, చిట్యాలరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 39మంది నిరుపేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైనా రూ.13,96,000లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో సైతం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు.

ఈ భారం మోయలేం



- అప్పు చేసి పంచాయతీల నిర్వహణ
- నిన్నటి దాక కులగణన, నేడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- ఒత్తిడితో విధులు

రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం అమలుచేయాలన్నా అధికారులకు గుర్తొచ్చేది గ్రామకార్యదర్శులు. పంచాయతీరాజ్ శాఖ తరుపున వీరిని నియమించినా అన్నిశాఖల పనులు చేయాల్సిన పరిస్థితి వీరిది. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి పనులకు సొంత డబ్బును వినియోగించి ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

గ్రామపంచాయతీలకు కొన్నినెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వలేదు. ఈ ఏడాది జనవరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి పంచాయతీల నిర్వహణ కోసం కార్యదర్శులు అప్పులుతెచ్చి పనులు చేయించారు. పైప్‌లైన్, వీధిలైట్లు, పారిశుధ్యం, వాహనాల డీజిల్, ఇతర చిన్నచిన్న అవసరాలకు కార్యదర్శులు సొంతడబ్బును ఖర్చుచేశారు. ఇలా లక్షల్లో ఖర్చు చేసిన కార్యదర్శులు ప్రభుత్వ నిధుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 1200మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఉమ్మడి పీఏపల్లి మండలంలోనే రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పైగా కార్యదర్శులు ఖర్చు చేసి ఎదురుచూస్తున్న పంచాయతీల్లో అక్కంపల్లి, అంగడిపేట, పీఏపల్లి, దుగ్యాల, పెద్దగట్టు, అజ్మాపురం ఉన్నాయి.

ఇతరశాఖల పనులు చేయాల్సిందే..

గ్రామకార్యదర్శులు తమశాఖ విధులతో పాటు ఇతరశాఖల పనులూ చేయాల్సివస్తోంది. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం సర్వే చేస్తున్నారు. అలాగే మరుగుదొడ్లు, వ్యవసాయ శాఖ సర్వేలను కూడా వీరికే అప్పగించారు. వాటితో పాటు విద్యాశాఖకు సంబంధించిన మరికొన్ని పనులు కట్టబెట్టారు. ఇదివరకు వీఆర్వోలు చూసే కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌కు సంబంధించి బాధ్యతలు వీళ్లే చూస్తున్నారు. ఇటీవల కులగణన కోసం ప్రతిగడపను తొక్కాల్సి వచ్చింది. అదేవిధంగా ముసాయిదా ఓటరు జాబితా తయారీ, అభ్యంతరాల స్వీకరణ చేపట్టారు. వరుస పనుల్లో బిజీగా ఉన్న పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను కూడా అప్పగించడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఎంపీడీవో, డీఎల్‌పీవో, డీపీవో నుంచి మెమోలు జారీ చేస్తున్నారని వాపోతున్నారు.

తగిన గుర్తింపు ఇవ్వడం లేదు



ప్రభుత్వం అప్పజెప్పిన ప్రతీ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ ప్రభుత్వం తమకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదు. ఆదివారం మినహాయింపు ఇవ్వాలి. సీనియారిటీ ఉన్న కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలి.

రాంచంద్, గ్రామ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు

పనిభారం తగ్గించాలి



పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నాం. ఇతర శాఖల పనులు కూడా చేయాలని ఒత్తిడి చేయడం భావ్యం కాదు. తమ శాఖలో పనుల ఒత్తిడి ఉన్నప్పటికీ ఇతర శాఖలు సహాయం చేయటం లేదు.

ఆర్.దీప్తి, వైస్‌ప్రెసిడెంట్, మండల కార్యదర్శుల సంఘం

సమీపిస్తున్న గడువు.. అందని మార్గదర్శకాలు

- ఈ నెల 28న వ్యవసాయ కూలీలకు ప్రభుత్వ ఆర్థికసాయం పథకం ప్రారంభానికి కసరత్తు
- కూలీల ఎంపిక విధానంపై అనుమానాలు



మోత్కూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూమిలేని మహిళా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థికసహాయం అందిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో హామీఇచ్చింది. ఆ హామీని అమలుచేయాలన్న డిమాండ్ పెరగడంతో ఈ నెల 28 నుంచి ఆ పథకం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఏడాదికి రెండు విడతలుగా, ఒక్కోవిడత రూ.6వేల చొప్పున రెండు పర్యాయాల్లో మొత్తం రూ.12వేలు ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపికను గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టనున్నట్లు సమాచారం. పథకం ప్రారంభానికి గడువు సమీపిస్తున్నా లబ్ధిదారుల గుర్తింపునకు మార్గదర్శకాలు ఏంటన్నది అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఉపాధిహామీ జాబ్‌కార్డుల ఆధారంగా వ్యవసాయ కూలీలను ఎంపిక చేస్తారన్న వార్తలు వెలువడుతున్నాయి. ఉపాధిజాబ్ కార్డుల్లో రైతులు, కూలీలకు ఉన్న భూమి వివరాలు పొందుపర్చరు. దీంతో భూమిలేని వ్యవసాయకూలీలను ఎలా గుర్తిస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఆధారపడితే రాజకీయఒత్తిళ్లకు తలొగ్గి తప్పుడు సమాచారం ఇచ్చే అవకాశం ఉందంటున్నారు.

భూమి కూలీల గుర్తింపు ఫీల్డ్‌అసిస్టెంట్ల ద్వారా..

ఉపాధిహామీ జాబ్‌కార్డులు కలిగి ఉన్న వారిలో భూమి ఉన్నవారు ప్రభుత్వం అమలుచేసిన భూమి అభివృద్ధి, టేకు చెట్లునాటడం, తోటల పెంపకం, వర్మీకంపోస్టు, పశువుల షెడ్లు లాంటి వివిధ పథకాల్లో ఏదో ఒకదాంట్లో లబ్ధి పొంది ఉంటారంటున్నారు. వాటి ఆధారంగా ఫీల్డ్‌అసిస్టెంట్లు భూమి లేని వ్యవసాయ కూలీలను గుర్తిస్తారని చెబుతున్నారు. తొలుత 100 రోజులు పనిచేసిన వారిని, ఆ తర్వాత వరసగా 90రోజులు, 80రోజులు, 70రోజులు పనిచేసిన వారిని పరిగనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేస్తారంటున్నారు.

మునిసిపాలిటీ పరిధిలోని కూలీలకు ఎలా?

భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆర్థికసహాయం అందించే పథకం లబ్ధిదారులను ఉపాధి జాబ్‌కార్డుల ఆధారంగా ఎంపిక చేస్తే మునిసిపాలిటీల పరిధిలోని తమ పరిస్థితి ఏంటని వ్యవసాయ కూలీలు ప్రశ్నిస్తున్నారు. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 15వేల జనాభా కలిగిన గ్రామపంచాయతీలను మునిసిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసింది. 15వేల జనాభా లేని చోట సమీప గ్రామాలను కలిపి మునిసిపాలిటీలు చేశారు.మునిసిపాలిటీల్లో ఉపాధి హామీ పథకం వర్తించకపోవడంతో ఆయా పరిధిల్లోని గ్రామాల్లో జాబ్‌కార్డులు రద్దయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 6, నల్లగొండ జిల్లాలో 8, సూర్యాపేట జిల్లాలో 5 మునిసిపాలిటీలు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ఉపాధి జాబ్‌కార్డులు లేవు. ఉపాధిజాబ్ కార్డుల ఆధారంగానే వ్యవసాయకూలీలను ఎంపిక చేసిన పక్షంలో మునిసిపాలిటీల్లోని వ్యవసాయకూలీలకు ప్రభుత్వ పథకం అందకుండాపోతుందన్న చర్చ సాగుతోంది.ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు రాలేదు

భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆర్థికసహాయం అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం మార్గదర్శకాలు ఏమీ అందలేదు. ఈ నెల 28 నుంచి భూమిలేని వ్యవసాయ కూలీలకు ఆర్థికసహాయం అందిస్తారన్న వార్తలు పత్రికల్లో చదవడమే తప్ప ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు.

డీ బాలాజీ, ఎంపీడీవో, మోత్కూరు

100 రోజులు పని చేసిన కుటుంబాలు 1,379 మాత్రమే

ప్రభుత్వం తొలుత 100 రోజులు పనిచేసిన భూమి లేని కూలీలకు పథకం వర్తింపజేయనున్నట్టు తెలుస్తోంది. అదే ప్రామాణికమైతే 100రోజులు పనిచేసిన కుటుంబాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,43,169 జాబ్‌కార్డులకు 327, నల్లగొండ జిల్లాలో 3,59,540 జాబ్‌కార్డులకు 652, సూర్యాపేట జిల్లాలో 2,62,583 జాబ్‌కార్డులకు 400 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 1,379 కుటుంబాలే అర్హులుగా ఉండనున్నాయి. ఇందులో భూమి లేని కూలీలు ఎందరు అన్నది తేలాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 53,05,312 జాబ్‌కార్డులు ఉండగా 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు 30,141 ఉన్నాయి.

మునిసిపాలిటీల్లోని కూలీలకూ వర్తింపజేయాలి



గ్రామస్థులు వద్దంటున్నా మా గ్రామాన్ని కలిపి 2018లో మోత్కూరు మునిసిపాలిటీని చేశారు. మునిసిపాలిటీల్లో ఉపాధిహామీ పథకం వర్తింపజేయడంలేదు. అప్పటి నుంచి ఆరేళ్లుగా గ్రామంలోని కూలీలం వేసవిలో పని లేక నష్టపోతున్నాం. ఇప్పుడు ఉపాధి జాబ్‌కార్డుల ఆధారంగా మహిళా వ్యవసాయకూలీలను ఎంపిక చేస్తే మాకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందించాలి.

తొంట రమాదేవి, వ్యవసాయ కూలీ, కొండగడప

అర్హులందరికీ సాయం అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇచ్చే ఆర్థికసహాయాన్ని అర్హులైన కూలీలందరికీ వర్తింపజేయాలి. జాబ్‌కార్డులు ఉన్నవారికి 100 రోజులు, 90, 80, 70రోజులు పనిచేసిన వారికే ఇస్తాననడం సరి కాదు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా లబ్ధిదారులను ఎంపికచేయాలి. లేదా మరోసారి భూమి లేని వ్యవసాయ కూలీల గుర్తింపు కోసం సర్వే నిర్వహించి భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ ఆర్థికసహాయం అందించాలి.

రాచకొండ రాములమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు

హత్యా? ఆత్మహత్యా?

- మిస్టరీగా మారిన యువకుడి మృతి
- మృతుడి భార్యపై అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు



కుమార్(ఫైల్ ఫొటో)

డిండి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా డిండి మండలంలోని దేవత్‌పల్లితండాకు చెందిన రమావత్ కుమార్(25) మృతి మిస్టరీగా మారింది. డిండి ఎస్ఐ రాజు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రమావత్ కుమార్‌కు చందంపేట మండలం పోల్యానాయక్‌తండాకు చెందిన లక్ష్మి(పొట్టి)తో 10 ఏళ్ల కిందట వివాహం జరిగింది. జీవనోపాధి కోసం వీరు ఏడాది కిందట హైదరాబాద్‌కు వెళ్లారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో రమావత్ కుమార్ హైదరాబాద్‌లో గతంలో ఎలుకల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడే చికిత్స అందించడంతో అతడి ఆరోగ్యం మెరుగుపడింది. హైదరాబాద్ నుంచి రెండు నెలల కిందట ఇరువురు తిరిగి తండాకు చేరుకున్నారు. తమకున్న వ్యవసాయ భూమిలో వేరుశనగ పంటను సాగు చేశారు. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో పైరుకు నీళ్లు పెట్టేందుకు భార్యాభర్తలు పొలానికి వెళ్లారు. అదే రాత్రి తెల్లవారుజామున మూడు గంటల సమయంలో లక్ష్మి తండాకు చేరుకొని తన భర్త రమావత్ కుమార్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తండావాసులకు తెలిపింది. తండావాసులు పొలం వద్దకు చేరుకొని చెట్టుకు వేలాడుతున్న కుమార్ మృతదేహాన్ని తండాకు తరలించి పోలీసులకు, హైదరాబాద్‌లో ఉంటున్న రమావత్ కుమార్ సోదరులు లక్ష్మణ్, రమేష్‌లకు సమాచారం అందించారు. కుమార్ మృతిపై కుటుంబసభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కుమార్ మూతిపై బలమైన వస్తువుతో కొట్టడంతో నోట్లోని పండ్లు ఊడిపోయి తీవ్ర రక్తస్రావమైంది. వీపు, అవయవాలపై తీవ్రగాయాలున్నాయి. ఉరి వేసుకున్న చెట్టుకు కొద్ది దూరంలో రక్తపు ధారలు కనిపిస్తున్నాయి. రమావత్ కుమార్‌కు తీవ్ర రక్తస్రావమైనప్పటికీ తాను ధరించిన షర్టు, పాయింట్‌పై ఒక్క రక్తపు చుక్క కూడా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. రమావత్ కుమార్ భార్య లక్ష్మి తన భర్తను హత్య చేయించి ఆత్మహత్యగా చిత్రీకరిస్తోందని బంధువులు ఆరోపిస్తున్నారు. కుమార్ తల్లి సుకిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. లక్ష్మి(పొట్టి)ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. కుమార్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వీరయ్య(ఫైల్ ఫొటో)

తిప్పర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి తర్వాత నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం శిలార్‌మియాగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కలి వీరయ్య(38) తిప్పర్తి మండలకేంద్రానికి చెందిన మాడపల్లి జీవన్‌రెడ్డికి చెందిన బోర్‌బండి వాహనంపై డ్రిల్లర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల తర్వాత అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ఉన్న మహేంద్ర హోటల్ ఎదుట బోర్ వేశారు. బోరు వేయడం పూర్తయ్యాక బోర్‌పైపులను తీస్తున్న క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం వైర్లకు బోరు పైపులు తగలడంతో డ్రిల్లింగ్ ఆపరేటర్ వీరయ్య విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. అక్కడే ఉన్న బోరు సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా బోరు పనులు చేయించి తన భర్త మృతికి కారణమైన బోరుబండి యజమాని జీవన్‌రెడ్డిపై వీరయ్య భార్య జక్కలి కవిత ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో, లారీ ఢీకొని...

చింతపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం నేరడుగొమ్ము మండలం దాసర్లపల్లి గ్రామానికి చెందిన బాణావత్ జాను(25) తల్లి మంగిలి, తండ్రి బద్య హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవితం సాగిస్తున్నారు. ఆటోలో తన తల్లితో కలిసి నేరడుగొమ్ము మండలం దాసర్లపల్లి గ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో డిండి మండలం వావికోల్ గ్రామానికి చెందిన ఎండీ నహీమొద్దీన్ అజాగ్రత్తగా నసర్లపల్లి గేట్ సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డుపై పార్క్ చేసి వెళ్లారు. ఆటో హైదరాబాద్ వైపు వెళుతూ మలుపు వద్ద ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో జాను(25) అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి మంగిలికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. జాను కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు రోడ్డుపై అజాగ్రత్తగా లారీని పార్క్ చేసిన బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నిడమనూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు సాగర్ ఎడమకాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో మంగళవారం వెలుగుచూసింది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన చల్లంచర్ల శివనాగరాజు(23) తల్లిదండ్రులతో కలిసి బతుకుదెరువు కోసం అనుముల మండలం అలీనగర్ చెక్‌పోస్టు వద్ద ఇటుకలబట్టీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శివనాగరాజుకు మూర్ఛవ్యాధి ఉంది. సొంత ఊర్లో పని ఉండటంతో శివనాగరాజు తల్లిదండ్రులు ఆదివారం మంచికల్లు గ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో శివనాగరాజు ఇటుకల బట్టీకి పనికి వెళ్లకపోవడంతో మేస్త్రి శివనాగరాజుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. మంగళవారం నిడమనూరు మండలం వేంపాడ్ వద్ద ఉన్న సాగర్ ఎడమకాల్వలో ఓ మృతదేహం కనిపించగా గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు చెక్‌పోస్టు వద్ద ఇటుకల బట్టిలో పనిచేస్తున్న శివనాగరాజుగా గుర్తించారు.

పోలీసులు మృతదేహాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మూర్ఛవ్యాధితో బాధపడటం, పెళ్లి కాకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్న శివనాగరాజు మనస్తాపంతో కాల్వలో ఆదివారం సాయంత్రం దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. శివనాగరాజు తండ్రి చల్లంచర్ల వెంకట్రామయ్యయ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

రచనారంగంలో రాణిస్తున్న మల్లారెడ్డి



యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు లెక్కల మల్లారెడ్డి రచనా రంగంలో దూసుకెళ్తున్నారు. పల్లె ఇతివృత్తాంతంగా ఆయన రచనలు అందరినీ ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేస్తున్నాయి. నవలారచయిత, నాటకకర్తగా ప్రసిద్ధుడైన లెక్కల మల్లారెడ్డి జీవనపోరాటాలు, ఆదర్శం, తుదితీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, శంఖారావం, కవి సంపుటిలు వెలువరించారు. ఉపాధ్యాయుడిగా మల్లారెడ్డి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పారు.

తాజాగా 'నా పల్లె చిన్నబోయింది'

మల్లారెడ్డి రచించిన 'నాపల్లె చిన్నబోయింది' పాట యూట్యూబ్‌లో మంచి ఆదరణ పొందుతోంది. పల్లెల్లో తాజా పరిస్థితిపై ఆయన ఆవేదనకు అక్షర రూపం నా పల్లె చిన్నబోయింది. ఒకనాటి పల్లె ఆప్యాయతలు, అనురాగాలను పాటలో ఆయన గుర్తు చేశారు. చెట్టు కింద రచ్చబండపై చర్చలు, చెట్లాచేమలు, పశువుల గుంపులు, పక్షుల కిలకిల రావాలు, సెలయేటి గలగలలు, పచ్చదనాల పరిమళాలను ఆయన పాటలో స్ఫురింపజేశారు. అదేవిధంగా నేడు దీనంగా మారిన పల్లె పరిస్థితులను వెల్లడించారు. పల్లె వైపు ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేసేలా పాటలోని ప్రతి వాఖ్యాన్ని ప్రతిభావంతంగా మల్లారెడ్డి మలిచిన తీరును యూట్యూబ్ వీక్షకులు జయహో అంటున్నారు. పల్లె చిన్నబోయింది పాటను దేవత సుధాకర్ ఆలపించగా, జడల రమేష్ సంగీతాన్ని అందించారు. ఈతరం భారతమ్ క్రియేషన్స్ బ్యానర్‌పై యూట్యూబ్‌లో విడుదల చేశారు.




భువనగిరిలో మల్లారెడ్డి రచించిన పుస్తకాల ఆవిష్కరణ సందర్భంగా సన్మానం(ఫైల్)

సాహితీ 'మట్టి'లో మాణిక్యం
కవి బండారు శంకర్

- శంకర్ ప్రథమ నవల 'పిడికెడు మట్టి'కి అంపశయ్య నవీన్ అవార్డు
- హన్మకొండలో పురస్కారం అందజేత



నార్కట్‌పల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడం గ్రామానికి చెందిన బండారు శంకర్ సాహితీరంగంలో రాణిస్తున్నారు. 'సాహిత్యం'లో తన ప్రతిభను చాటుతూ ప్రతిష్టాత్మక 'అంపశయ్య నవీన్' ట్రస్టు పురస్కారాన్ని పొందారు. ప్రథమ నవల 'పిడికెడు మట్టి' రచనకు అంపశయ్య నవీన్ ట్రస్టు అవార్డును అందజేసింది. కూలీ పని చేసుకునే ఒక సగటు మనిషి నీతిగా బతుకుతూ తన చుట్టూ ఉన్న వారికి తన పిల్లలకు నిజాయితీగా బతకడమెలాగో నేర్పించిన కథాసారమే ఈ 'పిడికెడు మట్టి' ఇతివృత్తం. సురభి కళాకారుడైన తండ్రి బండారు కోటయ్య,సౌభాగ్యమ్మ దంపతుల రెండో సంతానం శంకర్. సంగీతం నేర్చుకుని గాయకుడు కావాలనుకున్నాడు కానీ నవలలు రాస్తూ కవిగా మారాడు. అతడు రాసిన తొలి కవిత 'వలస బతుకు' 2006లో ప్రచురితమైంది. తెలంగాణ ఉద్యమ సమయంలో పాటలు, కవితల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసిన కవులు, రచయితల జేఏసీలో శంకర్ కూడా సభ్యుడే. 2018లో రాసిన 'శిబ్బి' కవితా సంపుటిని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. 'ఉనికి' పేరిట సామాజిక, సాంస్కృతిక వేదికను స్థాపించాడు. తొలుత చిన్న చిన్న సాహిత్య సభలు, పుస్తకావిష్కరణలు చేసిన శంకర్ 'ఉనికి' వేదికను తెలంగాణ సాహిత్య అకాడమీ గుర్తించేస్థాయికి తీసుకెళ్లారు. అంపశయ్య నవీన్ అవార్డు రావడంతో శంకర్‌ను కవులు, రచయితలు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, బెల్లి యాదయ్య, చింతల యాదగిరి, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్దిరెడ్డి గణేశ్, పుప్పాల కృష్ణమూర్తి అభినందించారు.



అవార్డును తెచ్చి పెట్టిన పిడికెడు మట్టి నవల

రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేకే జయరాజన్ తెలిపారు. నల్లగొండలో నిర్వహించిన జావెలిన్ త్రో పోటీలతో కేతావత్ శ్రీధర్(8వ తరగతి) ప్రథమస్థానంలో నిలవగా, కుంచాల గౌతం(9వ తరగతి) ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇరువురు ఈ నెల 30న హన్మకొండలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటిలు నీలం రమేష్, శివశంకర్, సుజయ్‌కుమార్ తదితరలుఉ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రీక్వార్టర్స్‌కు యాదాద్రి జిల్లా బాలికల జట్టు

ఆలేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో యాదాద్రిభువనగిరి జిల్లా బాలికల జట్టు ప్రీక్వార్టర్స్‌కు చేరింది. ఈ నెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహించిన పోటీల్లో ఆసిఫాబాద్, కొత్తగూడెం జట్లపై విజయం సాధించి ప్రీక్వార్టర్స్‌కు చేరినట్లు కోచ్ సాత్విక మేనేజర్ వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను కబడ్డీ అసోసియేషన్ యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, కోశాధికారి గంధమల్ల కుమార్, సహాయ కార్యదర్శులు విజయ్‌కుమార్, చంద్రకుమార్, యాక సందీప్ అభినందించినట్లు ఆమె తెలిపారు.

మోస్ట్ పాపులర్ వైశ్య లైమ్‌లైట్ అవార్డు అందుకున్న గీత



గీతకు అవార్డును అందజేస్తున్న ఐవీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా

కొండమల్లేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లికి చెందిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శి గుమ్మడవెల్లి గీత జాతీయ స్థాయి మోస్ట్ పాపులర్ వైశ్య లైమ్‌లైట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మానేపల్లి ఆభరణాల దుకాణం వారు ప్రతి ఏటా ఈ ఈ అవార్డును 10 మంది మహిళలకు అందజేస్తున్నారు. 2024లో నిర్వహించిన పోటీలో గీత 10వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐవీఎఫ్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, ఇమ్మడి శివ, మంగ్లి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న దంపతులు

ఎల్లమ్మ ఆలయంలో దొరికిన ఉంగరం భక్తురాలికి అందజేత



ఎస్‌హెచ్‌వో సమక్షంలో బాలమణికి ఉంగరాన్ని అప్పగిస్తున్న సాయిబాబా దంపతులు

భువనగిరిరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దొరికిన బంగారు ఉంగరాన్ని తిరిగి అందజేసి ఓ దంపతులు నిజాయితీని చాటుకున్నారు. యాదాదిభువనగిరి జిల్లా భువనగిరి సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో జరిగింది. బీబీనగర్ మండలానికి చెందిన కట్ట బాలమణి మంగళవారం భువనగిరి శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకుంటున్న క్రమంలో ఆమె చేతికి ఉన్న అర తులం బంగారు ఉంగరంపోయింది. వెంటనే భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగె సాయిబాబా, కీర్తి దంపతులు ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లగా అక్కడ ఆ ఉంగరం వారికి లభించింది. వెంటనే డయాల్-100 చేసి పోలీసులకు సమాచారం అందజేశారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ బాలమణిని పోలీస్ స్టేషన్‌కు రప్పించి దంపతులు సాయిబాబా, కీర్తిల సమక్షంలో ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ మాట్లాడుతూ నిజాయితీ చాటుకున్న దంపతులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

శ్యామ్‌బెనగల్‌కు పోచంపల్లితో ప్రత్యేక అనుబంధం



సుస్మాన్ సినిమా షూటింగ్ సందర్భంగా చేనేత నాయకులు రుద్ర అంజయ్య, చిలివేరు రామలింగంతో శ్యామ్‌బెనగల్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతిచెందిన ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, పద్మశ్రీ శ్యామ్‌బెనగల్‌కు యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లితో ప్రత్యేక అనుబంధం ఉంది. 1985లో పారిశ్రామికీకరణతో చేనేత, చేతివృత్తులు ఎలా అంతరించిపోతున్నాయో తెలిపేందుకు ఆయన హిందీలో 'సుస్మాన్' అనే చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమాలో ప్రముఖ నటుడు ఓంపురి, నటి షబానాఅజ్మీ నటించారు. ఈ సినిమాను అప్పట్లో భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్‌లో చేనేత కార్మికుడు కొంగరి సుందరయ్య ఇంటిలో 40రోజుల పాటు చిత్రీకరించారు. అంతేగాక భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ప్రముఖ వస్త్ర శిల్పి చిలివేరు రామలింగం ఇంటి వద్ద, చేనేత సహకార సంఘం ఆవరణలో ఈ సినిమాలోని సన్నివేశాలను చిత్రీకరించారు. రాత్రి పట్టణంలోని 101 దర్వాజల భవనంలో వారు బస చేసేవారు. నాడు సరైన వాహన సదుపాయాలు లేకపోవడంతో తిరిగి ఉదయం సైకిళ్లు, స్కూటర్లపై షూటింగ్ కోసమని ముక్తాపూర్ గ్రామానికి చేరుకునేవారు. చాలాకాలం పాటు షూటింగ్ జరగడంతో స్థానికులతో శ్యామ్‌బెనగల్‌తో పాటు సినిమాలో నటించిన నటులకు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. షూటింగ్‌కు అన్నిరకాలుగా సహకరించినందుకు తన అన్న మాజీ జడ్పీటీసీ కొంగరి భాస్కర్‌కు దర్శకుడు శ్యామ్‌బెనగల్ నవరత్నాలు పొదిగిన ఉంగరాన్ని బహుమతిగా ఇచ్చారని మాజీ సర్పంచ్ కొంగరి క్రిష్ణ గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో తన అమ్మ మెడలోని బంగారు గొలుసును సినిమాలోని నటి షబానా అజ్మీ ధరించారని ఆయన తెలిపారు. శ్యామ్ బెనగల్ మృతితో పట్టణంలోని కర్నాటి మల్లేశ్వర్, గాడిపల్లి పరమేశ్వర్, చిలివేరు గోవర్ధన్, చిలివేరు మృత్యుంజయ, ఏలె భిక్షపతి, బోగ రాములుతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్నో అవార్డులను కైవసం చేసుకున్న సుస్మాన్

పారిశ్రామికీకరణ నేపథ్యంలో గ్రామీణ చేనేత కార్మికుల పోరాటం, బతుకు ఆరాటం ఇతివృత్తంపై నిర్మించిన 'సుస్మాన్' సినిమాకు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. 1987లో విడుదలైన ఈ సినిమా పనోరమ ఫిల్మ్ ఫెస్టివల్, ది చికాగో ఫిల్మ్ ఫెస్టివల్, సిడ్నీ, మెల్‌బోర్న్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది.

బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి రిమాండ్

వలిగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వలిగొండకు చెందిన కళ్లెం శ్రీను బెదిరింపులకు పాల్పడుతుండటంతో పలువురు ఫిర్యాదు చేశారు. నెల రోజుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న శ్రీను మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. అరెస్టు చేసి నల్లగొండ జైలుకు రిమాండ్‌కు తరించామని, శ్రీనుపై గతంలోనే రౌడీషీట్ తెరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

31క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మర్రిగూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడలో పోలీసులు 31 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు. మంగళవారం కమ్మగూడెంలోని రైస్‌మిల్లులో 24 క్వింటాళ్లు, మండలకేంద్రంలోని మరో రైస్‌మిల్లులో 7క్వింటాళ్ల రేషన్‌బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకుని, మిల్లు యజమానులపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు ప్రపంచ శాంతికి చిహ్నం
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేటటౌన్, డిసెంబరు 24: క్రిస్మస్ వేడుకలు ప్రపంచ శాంతికి చిహ్నమని రాష్ట్ర నీరు పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు . క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్వమత సమ్మేళనాలకు తెలంగాణ రాష్ట్రం పెట్టింది పేరని స్పష్టం చేశారు. ప్రజలపై క్రీస్తు కరుణాకటాక్షాలు ఉండాలన్నారు. క్రైస్తవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు
మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, దయ, జాలి వంటి గుణాలను కలిగి తోటివారిని అభిమానించాలని క్రీస్తు తన సందేశాన్ని ఇచ్చారన్నారు. క్రైస్తవులంతా క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఏసు క్రీస్తు దయతోనే రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

పండుగను వైభవంగా జరుపుకోవాలి
శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



క్రైస్తవులు క్రిస్మస్ పండుగను వైభవంగా జరుపుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఏసు క్రీస్తు మానవాళి ఉద్ధరణకోసం భూలోకానికి వచ్చారన్నారు. ఏసు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి, సామరస్యాలకు ప్రతీక క్రిస్మస్



శాంతి, అహింస, తోటివారిని ప్రేమించే గుణాలను అలవర్చుకోవడమే క్రిస్మస్ పండుగ ఉద్దేశం. రంజాన్, దసరా, క్రిస్మస్‌లను ప్రభుత్వ వేడుకలుగా మార్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కింది. సమాజం శాంతియుతంగా ఉండాలి. అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి.

-జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే, సూర్యాపేట

కూలీలకు పెరిగిన డిమాండ్



వ్యవసాయ పనుల్లో కూలీల కొరత కారణంగా రైతులపై అదనపు భారం పడుతోంది. డీజిల్ రేట్లు, ఎరువు, పురుగు మందుల ధరలు పెరిగి అల్లాడుతున్న రైతులపై కూలీ రేట్ల పెంపు కూడా 'మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు' అనే సామెతలా మారింది. యాసంగి సాగులో నాట్లన్నీ దాదాపు ఒకేసారి వేయాల్సి వస్తుండడంతో డిమాండ్‌కు తగ్గట్లుగా కూలీలు దొరక్కపోవడంతో విధిలేని పరిస్థితిలో అందుబాటులో ఉన్న కూలీలపై రైతులు ఒత్తిడి తెస్తున్నారు. డిమాండ్ ఉండటంతో కూలీలు రేట్లు పెంచేశారు. అదును దాటితే సాగు దిగుబడిపై ప్రమాదం ఉంటుందని రైతులు అదనపు భారం మోయడానికే సిద్ధపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- వరి నాటుకూలీ రూ.750
- పార కూలీ రూ.1000
- డిమాండ్ పెరగడంతో పెరిగిన రేట్లు

మిర్యాలగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 5 లక్షల 20 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా రబీలో మరో 20 వేలు అదనంగా సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తుండగా ఒకేసారి పెరిగిన కూలీ రేట్లతో యాసంగి సాగుకు రైతులు యాతన పడుతున్నారు. అదనంగా పది రోజుల్లోనే 30-40 శాతం రేట్లు పెరగడంతో సాగు చేయలేక చతికిల బడుతున్నారు. నాటు కూలీకి రూ.750, పార కూలీకి రూ.1000కు పెంచారు. సాగర్ జలాశయంలోకి నీరు ఆలస్యంగా చేరడంతో వానాకాలం సాగు కొంత ఆలస్యమైంది. దాంతో రైతులు పంట కాలవ్యవధి తక్కువగా ఉన్న వరిని సాగు చేశారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్‌లో సమృద్ధిగా నీరు ఉండటంతో అధికారులు యాసంగి పంటకు ఆన్‌అండ్ ఆఫ్ నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించారు. రైతులు నాట్లు వేసుకునేందుకు వీలుగా మొదటి విడతలో ఆగస్టు 15- జనవరి-11 వరకు 27 రోజులు నిరంతరాయంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులందరూ వరినాట్ల పనులను పూర్తి చేసేందుకు పొలాలు దమ్ము చేసుకుని వరాల పనికి, నాట్ల కూలీలను సమకూర్చుకుంటుండంతో పని ఒత్తిడి పెరిగి రేట్లు పెంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు చల్లితే..

ఒక బస్తా ఎరువు చల్లితే రూ.130, దానిలో ఏదైన మిశ్రమం కలిపితే(గుళికలు, జింకు లాంటి) రూ.150కి పెంచారు. గతంలో ఈ కూలీ 100-130 గా వుండేది. నాట్లు వేసిన తురువాత నాట్ల మధ్య బాటలు తీసే కూలీ రేట్లను సైతం పెంచారు. ఎకరం పొలంలో బాటలు తీసినందుకు గాను రూ. 350 వుండగా ఈ సీజన్‌లో దానిని 400కు పెంచారు.

వ్యవసాయ పనులపై కూలీల అనాసక్తి

రానురాను వ్యవసాయ పనులపై కూలీలకు అనాసక్తి పెరుగుతోంది. వ్యవసాయ కూలీలలో 80 శాతానికి పైగా ప్రస్తుతం 50 ఏళ్లకు పైబడిన వారే కావడం గమనార్హం. వ్యవసాయ పనుల్లో శారీరక శ్రమ ఎక్కువ అవడంతో కొత్తతరం వ్యవసాయ పనులవైపు రావడం లేదని పరిశీలకుల అభిప్రాయం. నాట్లు వేయడం తెలియక పోవడం కూడా కూలీల కొరతకు కొంత కారణంగా భావిస్తున్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ సంపాదనకు యువత పట్టణాలవైపు చూస్తుండటంతో వ్యవసాయ పనుల్లో మానవ వనరులు తగ్గిపోతున్నాయని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో పని ఒత్తిడి పెరిగి కూలీల డిమాండ్ పెరగడంతో రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సీజన్‌లో కూలీ రేట్లు అమాంతం పెంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30-40 శాతం పెరిగిన రేట్లు

నాటు కూలీ రేటు రూ.750కి చేరుకుంది. 10 రోజుల క్రితం వరకు ఒక్కరికి రూ. 400 కూలీ కాగా ఇంటి నుంచి పొలం వద్దకు చేర్చేందుకు రూ.50 ఆటో చార్జీతో కలిపి రైతులు 450 చెల్లించేవారు. దానిని మూడు రోజుల్లో 550 కి పెంచగా ప్రస్తుతం రూ. 750కి చేర్చారు. రోజుకు 8 మంది ఆడకూలీలు నారు పీకి ఎకరం నాటు వేస్తారు. నారు పంచి వేయడానికి ఒక మగ కూలీకి రూ.1000 కలిపి ఎకరం నాటుకు రూ.7,000 వ్యయం అవుతోంది. గతంలో నారు పీకడం, నారు పంచుకోవడం, నాటు వేయడం కలిపి గుత్తాగా ఎకరం రూ. 4,300కు చేసేవారు. ఈ సీజన్‌లో గుత్తా కూలీ కూడా అదనంగా 300 పెంచి ఎకరం కూలీ రూ.4,600 చేశారు. గుత్తా కూలీలు దొరకని సందర్భంలో విడి కూలీలతో పని చేయిస్తే రైతుకు ఎకరం నాటు కూలీ 5,500 వరకు పడుతుండగా పెరిగిన రేట్లతో 1500-2000 వరకు అదనపు భారం పడుతోందని అంటున్నారు. పని ఒత్తిడి మూలంగా 10రోజుల్లోనే రూ.300 పెరగడంతో రైతులు విలవిలలాడుతున్నారు. దీనికి తోడు వరాలు తీసే పారకూలీ రోజుకు 800 నుంచి 1000 రూపాయలకు పెంచారు.

ప్రజాహితం



ప్రజాహిత యువ చైతన్య సభ్యులకు షీల్డ్ అందజేస్తున్న ఖమ్మం వైద్యశాల నిర్వాహకులు

మఠంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం పెదవీడు గ్రామానికి చెందిన తలసేమియా(రక్త హీనత) బాధితురాలికి గ్రామయువకులు అండగా నిలిచారు. బాధితురాలికి తరుచూ రక్తం ఎక్కించాల్సి రావడం, ప్రతి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి రావడంతో చిరుద్యోగి అయిన ఆమె తండ్రి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కసారి రక్తం ఎక్కించేందుకు సుమారు రూ.40వేలు ఆసుపత్రిలో చెల్లించాల్సి ఉండటం తండ్రికి తలకుమించిన భారంగా మారింది. దీనికి దీర్ఘకాలిక పరిష్కారం చూపాలని స్థానిక విద్యావంతులైన యువకులు నిర్ణయించుకున్నారు. ప్రజాహిత యువత చైతన్య పేరుతో సేవా సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏటా ఒకేసారి 70 నుంచి 80 యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించి ఖమ్మంలోని తలసేమియా పీఎస్‌సీఎస్ సొసైటీ నిర్వహణలో ఉన్న ఆసుపత్రికి అందజేసి బాధితురాలికి ఎప్పుడు అవసరమైనా ఉచితంగా రక్తాన్ని ఎక్కించేలా ఒప్పందం చేసుకున్నారు. ప్రతి ఏడాది 70 నుంచి 100 యూనిట్లు రక్తదానం చేస్తున్నారు. మంగళవారం పెదవీడు పంచాయతీలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 72మంది యువకులు రక్తదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

28నుంచి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు టీఎస్‌యూటీఎఫ్ 6వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. మంగళవారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాసభలకు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మహాసభలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు మొదటి రోజు రాష్ట్రం నలుమూలల నుంచి 7వేల మంది హాజరు కానున్నారని, 29, 30వ తేదీల్లో సంఘ ప్రతినిధులతో సభ నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు విద్యారంగాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగంపై శ్రద్ధ పెడుతున్నట్లు కనబడుతోందన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, నాగమణి మాట్లాడుతూ ఈ విద్యా వైజ్ఞానిక సభలకు ప్రభుత్వం ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించినందున ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్కా శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి

బొమ్మలరామారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేసి ఈనెల 31లోపు 100 శాతం పూర్తి చేయాలని యాదాద్రిభువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో నిజమైన లబ్ధిదారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా సర్వే నిర్వహించాలని అన్నారు. మండల వ్యాప్తంగా 9863మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఇప్పటి వరకు 7500మంది లబ్ధిదారుల సర్వే పూర్తయిందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సర్వేపై సమీక్ష నిర్వహించి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీవో శ్రీమాలిని పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గుట్ట మండలంలోని గొలగుడిసెల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి పూర్తి వివరాలను సేకరించి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని కోరారు. ఆయనతో పాటుగా ఎంపీవో సలీం, పంచాయతీ కార్యదర్శి అనురాధ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సర్వే చేస్తున్న అధికారులు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



గోదాదేవి అమ్మవారికి పాశుర పఠనం చేస్తున్న పండితులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణు పుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేద మంత్రాలతో పంచామృతభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజేయడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ఆంజనేయస్వామికి వడలు, బూరెలు, బెల్లం పానకం, వడపప్పు, అరటిపండ్లు నివేదించి వితరణ చేశారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్టలోనూ ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, రుద్రహవనం శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అలంకరణలో తీర్చిదిద్ది వేదికపై అధిష్టింపజేశారు. మహిళా భక్తులు పాల్గొని, హారతి నివేదించగా పొంగలి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

రామకృష్ణకు సాహితీ సాంస్కృతిక సంస్థ పురస్కారం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని విశ్వభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన కవి గజ్జెల రామకృష్ణకు సాహితీ పురస్కారం అందజేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో గజ్జెల రామకృష్ణను పురస్కారాన్ని ప్రముఖ కవి టి.గౌరీశంకర్ అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చేనేత వృత్తిలో కొనసాగుతూ 'దీపముండగానె', 'చంద్రుడు లేని ఆకాశం' తదితర కవితా సంపుటాలను రామకృష్ణ రూపొందించడం విశేష మని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినీ గీత రచయిత మౌనశ్రీ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



రామకృష్ణకు పురస్కారం అందజేస్తున్న టి.గౌరీశంకర్

పెంచిన కూలీ రేట్ల జీవో అమలు చేయాలి



పౌర సరఫరాల యాదాద్రి భువనగిరి జిల్లా మేనేజర్ జగదీష్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలకు పెంచిన కూలీ రేట్ల జీవో అమలు చేయాలని, లేనట్లయితే సమ్మె చేస్తామని హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం పౌర సరఫరాల జిల్లా మేనేజరు జగదీష్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2025 జనవరి ఒకటో తేదీ నుంచి ఎగుమతులను, దిగుమతులను నిలిపివేవసి నివధిక సమ్మె చేపడతామని అన్నారు. హమాలీ, స్వీపర్లకు రెండేళ్లకు ఒకసారి రేట్లు పెంచేలా జీవోలు ఉన్నాయన్నారు. జనవరి 2024 నుంచి పెరిగిన రేట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వనందున, గత అక్టోబరులో సివిల్ సప్లయ్ కమిషనర్‌తో జరిగిన చర్చల్లో రేట్లు పెంచేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. మూడు మాసాలు దాటినా ఒప్పందం అమలుకు మోక్షం లేనందున సమ్మె చేయాడానికి నిర్ణయించామన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఇమ్రాన్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, శంకరయ్య, క్రిష్ణ, శ్రీను తదితరులున్నారు.

ఎన్ని 'కలే'నా?

(5వపేజీ తరువాయి)

గ్రామపంచాయతీల సంఖ్య, మండల జనాభా తగ్గిపోయి నాలుగు ఎంపీటీసీ స్థానాలే మిగిలాయి. గత ఎన్నికల్లో నాలుగు స్థానాలకు రెండు స్థానాలను బీఆర్ఎస్, రెండు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకున్నాయి. దీంతో ఎంపీపీ, వైస్‌ఎంపీపీలను లాటరీ విధానంలో ఎన్నుకున్నారు. బేసి సంఖ్యలో స్థానాలు ఉంటే ఈ సమస్య ఉత్పన్నమయ్యేదికాదు. పంచాయతీరాజ్ నూతన చట్ట సవరణ ప్రకారం యాదాద్రి జిల్లాలో మోత్కూరు మండలంలో మాత్రమే ఒకే ఒక ఎంపీటీసీ స్థానం పెరగనుంది.

అధిక సంతానం ఉంటే అనర్హులే

ప్రభుత్వం ప్రతిపాదించిన పంచాయతీరాజ్-2024 చట్టం ప్రకారం పలు నిబంధనలు అమలులోకి రానున్నాయి. గతంలో జనాభా పెరుగుదలను అరికట్టేందుకు చట్టసభల్లో పోటీచేసే అభ్యర్థులకు పలు నిబంధనలు ఉన్నాయి. 1994 తరువాత ఇద్దరు పిల్లల కంటే అధిక సంతానం ఉంటే వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా గత ప్రభుత్వాలు చట్టాన్ని తీసుకొచ్చాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్-2024 చట్టంలో ఇద్దరు పిల్లల కంటే అధిక సంతానం ఉన్నా పోటీకి వెసులుబాటు కల్పిస్తుందని కొంతమంది నాయకులు ఆశాభావంతో ఉన్నారు. అయితే తాజా రూపొందించిన చట్టంలోనూ ఇద్దరు పిల్లల కంటే అధిక సంతానం ఉంటే పోటీకి అనర్హులుగానే ప్రకటించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో కొందరు పోటీచేసే అవకాశాన్ని కోల్పోనున్నారు. ఈ నిర్ణయంపై వారు నైరాశ్యంగా ఉన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా వారికి అనుకూలంగా ఉన్న వారిని ఎన్నికల రంగంలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మునిసిపాలిటీల్లోనూ మారనున్న రిజర్వేషన్లు

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మునిసిపాలిటీల్లోనూ రిజర్వేషన్లు మారనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పదేళ్ల రిజర్వేషన్ల విధానం మారనుండంతో ఏ వార్డులో ఏ రిజర్వేషన్లు ఉంటాయి, చైర్మన్ల పరిస్థితి ఏంటనే అంశం పట్టణ ప్రాంత రాజకీయ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. మునిసిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం మరో నెల రోజుల్లోగా ముగియనుంది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు మునిసిపాలిటీల ఎన్నికలను సైతం ప్రభుత్వం నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక నేతలు పోటీ చేసేందుకు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ మేరకు అధిష్ఠానం పెద్దలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు మారనుండటంతో పల్లె, పుర రాజకీయాలు ఏ మలుపు తిరుగుతాయో చూడాల్సిందే.

బాకిగూడెం పంచాయతీకి ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలను పం పాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో బాకిగూడెంను కొత్త పంచాయతీగా గుర్తించే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం బెండల్‌పహాడ్ గ్రామ పంచాయతీ మధిర గ్రామంగా బాకిగూడెం ఉంది. ఈ పంచాయతీ పరిధిలో బాకిగూడెం, నల్లోనిబావి, కచ్చకాయలబావి, అవుసలోనిబావి గ్రామాలు ఉన్నాయి. సుమారు 900కు పైగా జనాభా ఉంది. కాగా బెం డల్‌పహాడ్ నుంచి బాకిగూడెం వరకు సుమారు 2.5కి.మీల దూరం ఉంది. పైగా రెండు గ్రామాల్లో జనాభా అటు ఇటుగా సమానంగానే ఉంది. పెన్షన్లు, రేషన్ సరుకులు, ఐకేపీ కేంద్రాల ఏర్పాటు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు మంజూరులో పక్షపా తం చూపిస్తున్నారనే వివాదాలు ఉన్నా యి. ఈ నేపథ్యంలో బాకిగూడెంను గ్రా మ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే వేముల వీరేశానికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఆయ న ఆదేశాలతో మండల పరిషత్ అధికారులు బాకిగూడెం, నల్లోనిబావి, కచ్చకాయలబావి గ్రా మాలను కలిపి కొత్త పంచాయతీగా బాకిగూడెంను గుర్తించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు.

పట్టణీకరణకు అనుగుణంగా ప్రభుత్వ స్కూళ్లను విస్తరించాలి

(5వపేజీ తరువాయి)

నుంచే కాకుండా పిల్లలు, తోటి పిల్లల నుంచి కూడా విద్య నేర్చుకుంటారు. దీనికి అనుగుణంగా ప్రాథమిక పాఠశాలల పునర్వ్యవస్థీకరణ జరగాలి. రాష్ట్ర విద్యాకమిషన్ ఏర్పాటు నిర్ణయం సముచితమైనది. ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నతవిద్య వరకు అన్ని రకాల విద్యను ఈ కమిషన్ పరిశీలించి, రాష్ట్రంలో విద్యారంగ మార్పులపై సూచనలు చేస్తుందని నమ్ముతున్నాం. ఆ దిశగా కమిషన్ కార్యాచరణ కనిపిస్తోంది.

పాఠశాలల బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తాం

నల్లగొండలో ఈనెల 28, 29, 30తేదీల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నాం. ఈ సభలకు మంత్రులు, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సామాజికవేత్తలు, విద్యావేత్తలను ఆహ్వానిస్తున్నాం. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్యను అందరికీ అందేలా ప్రభుత్వానికి అవసరమైన సూచనలు ఈ మహాసభల ద్వారా అందిస్తాం. ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలందరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరుతున్నాం.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	577
టీఎంసీలు	274.3640
ఎడమకాల్వకు నీటి విడుదల	8022
కుడికాల్వకు	7086
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,252 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	17,808 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.03 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.64 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	99.31 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	635 క్యూసెక్కులు

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 | కనిష్ఠం 20.0

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇక్కట్లు

● యాప్‌లో వివరాల నమోదుకు సాంకేతిక సమస్యలు ● మునిసిపాలిటీలో మొత్తం 3,050 దరఖాస్తులు ● ఈనెలాఖరుకు సర్వే పూర్తి


సర్వేను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీ

చండూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా చండూరు మునిసిపాలిటీ పట్టణంలో 3,050 మంది తమకు ఇళ్లు లేవని అర్జీలు పెట్టుకున్నారు. ప్రభుత్వంనుంచి ఇందిరమ్మ పేరుతో ఇళ్లు కేటాయించాలని, దరఖాస్తు చేసుకున్న కుటుంబాలను సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఆ దిశగా పట్టణంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు సర్వేలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో సిగ్నల్స్ సమస్యతో సర్వేలో జాప్యం జరుగుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకా రం చండూరు మునిసిపాలిటీలో మొత్తం 12,889 జనాభా ఉండగా, 10 వార్డులు ఉన్నాయి. ప్రతీ వార్డులో వార్డు ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలనే లక్ష్యంతో, ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుకోసం వార్డుల వారీగా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ప్రత్యేక ఐడీ సంఖ్యను ప్రభుత్వం కేటాయించింది. దరఖాస్తుల్లో ఇళ్లు లేనివారిని సర్వే చేసి మొదటి విడతలో ఎంపిక చేయనున్నారు.

60శాతం సర్వే పూర్తి

చండూరు మునిసిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకోసం 10వార్డుల నుంచి మొత్తం 3,050 దరఖాస్తులొచ్చాయి. అయితే మునిసిపాలిటీలో మంగళవారం నాటికి 60శాతం మాత్రమే దరఖాస్తుల సర్వే పూర్తయింది. అయితే సర్వేలో సాంకేతికపరంగా వివరాల నమోదు సేకరణలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. సాఫ్ట్‌వేర్‌లో అర్హుల ఇళ్లను గూగుల్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న సర్వేకు వెళ్లిన అధికారులు లబ్ధిదారులు తమ ఇళ్ల వద్ద లేకపోవడంతో వారు వచ్చే వరకూ ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ కారణంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయలేకపోతున్నారు. దీనికితోడుగా సిగ్నల్స్ సరిగా రాకపోవడం, వెబ్‌సైట్ సకాలంలో ఓపెన్‌కాక పోవడంతో సర్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా మార్పులు, చేర్పులు లేకపోవడంతో ఎంతోమంది ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హత కోల్పోయే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి మరోసారి అవకాశం కల్పిస్తే పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

31వ తేదీ వరకే సర్వే పూర్తి



మునిసిపాలిటీలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేశాం. అక్కడక్కడ కొంత వరకు మాత్రమే సాంకేతిక సమస్యలు వస్తున్నప్పటికీ, వాటిని అధిగమిస్తూనే సర్వే ప్రక్రియను ముమ్మరం చేస్తున్నాం. ఈ నెల 31వరకు సర్వే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాం. సాధ్యమైనంత మేరకు పూర్తయ్యే విధంగా ఎప్పటికప్పుడు సర్వేను పరిశీలిస్తున్నాం.

ఎండీ మున్వర్‌అలీ,
చండూరు మునిసిపల్ కమిషనర్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి నల్లగొండకు చేరుకుంటారు. 10 గంటలకు క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం, 11.30 గంటలకు ప్రభుత్వ హాస్పిటల్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి మెడికల్ ఎక్విప్‌మెంట్లను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు క్లాక్ టవర్ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు నల్లగొండ బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఎంపీల సమావేశంలో పాల్గొని అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్తారు.

ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వాలు

చిట్యాల, డిసెంబరు 24,(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ విమ ర్శించారు. చిట్యాలలో మంగళవారం ఆశా కార్యకర్తల బస్సుయాత్ర వాల్ పోస్టర్లను విడు దల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తల వేతనం రూ. 18 వేలకు పెంచాలన్నారు. నల్లగొండలో బుధవారం (నేడు) ఆశాల బస్సులో యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిట్యాల మండల అధ్యక్షురాలు జయమ్మ, సైదమ్మ, సునీత, రేణుక, కవిత, విజయ పాల్గొన్నారు.

హనుమద్గాయత్రీ యజ్ఞం

నార్కట్‌పల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మానిలో మంగళవారం హనుమాన్ గాయత్రీయజ్ఞాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గుండేపూడి జానకీ రామశర్మ, ఉత్తరాపల్లి నర్సింహాచార్యుల యాజ్ఞీకంలో గురుస్వాములు గంట్ల యాదగిరిరెడ్డి, బానాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి సింధూరాభిషేకం,పంచామృతాభిషేకాలను భక్తుల జై శ్రీరాం నినాదాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో వంశీధర్ రెడ్డి, కొడిమాల చిరంజీవి, జానకీ రాములు, పాక నర్సింహా, అలుగుబెల్లి మధు సూదన్ రెడ్డి, మల్లెబోయిన వెంకటేశ్వర్లు, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

నేడు, రేపు కొనుగోళ్లు బంద్

శాలిగౌరారం, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారంలోని టీఆర్ ఆర్ కాటన్ మిల్‌లో సీసీఐలో ఈనెల 25, 26 తేదీలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు శాలిగౌరారం మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ తెలిపారు. తిరిగి 27 శుక్రవారం ఒక్కరోజు మాత్రమే కొనుగోళ్లు చేసి మళ్లీ 28,29 శని, ఆదివారం రోజుల్లో సీసీఐ కొనుగోళ్లు బంద్ ఉంటుందన్నారు.

జర్నలిస్టుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి


మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

నల్లగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో నల్లగొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేసానన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదె రమేష్, ప్రెస్‌క్లబ్ గౌరవ సలహాదారులు గుండెగోని జయశంకర్ గౌడ్ , జర్నలిస్టులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌లో రాళ్ల కూల్చివేత

నార్కట్‌పల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ రెవెన్యూ శివారులో అనుమతి లేకుండా చేసిన ఓ వెంచరుపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సర్వే నంబర్ 139, 143 లలో సుమారు 24 ఎకరాల విస్తీర్ణంలో వెంచరును గతంలో ఏర్పాటు చేశారు. పంచాయతీ అనుమతి లేకుండానే ఏర్పాటు చేసి ప్లాట్లను సదరు వెంచరు నిర్వాహకులు విక్రయించారు. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు ఎంపీడీవో కే.ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్‌లు క్షేత్ర పరిశీలన చేశారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్‌లోని ప్లాట్ల హద్దురాళ్లను ఎక్స్‌కవేటర్‌లో తొలగించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను తేవడం దారుణం : సీపీఎం

మునుగోడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకురావడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం విమర్శించారు. మునుగోడులోని బీఆర్. అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం రైతులకు వ్యతిరేకమైన కేంద్ర వ్యవసాయ మార్కెటింగ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు వ్యతి రేక చట్టాలను రద్దు చేస్తున్నామని గతంలో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మళ్లీ అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్ర మంలో సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, వరికుప్పల ముత్యాలు, కట్ట లింగస్వామి, యాసరాణి శ్రీను, లింగస్వామి, వీరమల్ల హనుమయ్య, కాంత య్య, కొంక రాజయ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

చిట్యాలరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెనపల్లి గ్రామానికి చెందిన యాకారి యాదయ్య, ఉమారాణి కుమార్తె యాకారి భావన ఉత్తరాంఖడ్ కాశీపూర్‌లో ఐఐఎంలో సీటు సాధించింది. విద్యార్థినికి మండలం ఏపూర్ లోని సౌమ్య విద్యామందిర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ తాటి సోమ లింగం ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బొడిగె రవీందర్, నరేష్, యాదయ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి నమూనా సేకరణ

మర్రిగూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మిషన్ భగీరథ నీటి నమూనాను ఆర్‌డబ్ల్యూఎస్, ప్రభుత్వ వైద్యాధికారులు మంగళవారం సేకరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఉన్న ట్యాంకులో నీటిని తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని 47 ఆవాస గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిలో ఫ్లోరిన్‌శాతం ఎంత ఉందని పరీక్ష చేస్తున్నట్లు తెలిపారు. అలాగే బోర్ వాటర్‌లో ఎంత ఫ్లోరిన్ శాతం ఎంతో ఉందో తెలుసుకోవడానికి నీటిని తీసుకున్నామన్నారు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

నాంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఎంపి కను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీవో ఝాన్సీ రెడ్డి సూచించారు. మండలంలోని గట్లుమల్లేపల్లి, మహమ్మదాపురం, నాంపల్లి మండల కేంద్రాల్లో మంగళవారం సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరి ఇంటికి అధికారులు వచ్చి సర్వే చేస్తారని ప్రజలు ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, రమేష్, వెలుగు సీసీ సావిత్రి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడిగా లింగస్వామి

తిప్పర్తి, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా రావుల లింగస్వామిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పారెపల్లి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీలర్లు నెమలి శ్రీనివాస్, కారె శ్రీనివాస్, కోటగిరి సూర్యం, సత్తిరెడ్డి, పగిళ్ళ వెంకటేశ్వర్లు, జాఫర్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కేతేపల్లి: లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత పాలకులు చేసిన అప్పులు తీరుస్తూనే మరోవైపు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎ ంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరడ్డి తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి, మార్కెట్ డైరెక్టర్లు ఎస్‌కే.లతీఫ్, బయ్యా మత్తయ్య, పరశురాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కోట పుల్లయ్య, మట్టి సాల్మన్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి

కట్టంగూరు (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చూస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. క్రిస్మస్ సందర్భంగా అధికారికంగా కట్టంగూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మండలంలోని క్రైస్తవులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, డీటీ సుకన్య, ఆర్‌ఐ కుమార్ రెడ్డి, ఎంపీవో చలపతి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారు కృష్ణయ్య, బూరుగు శ్రీను, దార భిక్షం, మిట్టపల్లి శివ, ఐతగోని నర్సింహ, మహేశ్వరం నగేష్, పాస్టర్లు మర్రి రాజు, అబ్రామ్, యేసురాజు, యహోవాదాసు, డేవిడ్, యాకుబ్, అనిల్ ఉన్నారు.


చిట్యాల రూరల్: సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాగు నీటి కాల్వలకు నిధుల విడుదలపై హర్షం

● సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చిట్యాలరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వ పనులకు నిధులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు సీఎం రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పోలగోని సైదులు, పట్ల జనార్దన్ జన్నపాల శ్రీను, ఉయ్యాల నరేష్, పాకాల దినేష్, కురుపటి లింగయ్య, మర్రి రమేష్, మేడబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

నార్కట్‌పల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విశ్రాంత డీఈవో గద్దపాటి సరోజని సహకారంతో దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ, ఎండీ.సర్వర్ అలీ, ఎస్‌కే మాలిక్‌బాబా, బొబ్బని లవకుమార్, లెనిన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి


అడ్లూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ జె.శ్రీనివాస్

శాలిగౌరారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శాలిగౌరారం మండలం అడ్లూర్, గురజాల గ్రామాల్లో చేప డుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 4,31, 831 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 3,60, 205 గ్రామాల్లో, 71,626 దరఖాస్తులు మునిసి పాలిటీల పరిధిలో వచ్చాయన్నారు. నేటి వరకు 1,81, 952 ఇళ్లను సిబ్బంది సర్వే చేశారని తెలిపారు. శాలిగౌరారం మండలంలో కేవలం 39 శాతమే సర్వే పూర్తయ్యిందని అడ్లూరు, వంగమర్తిలో నెట్‌వర్క్ ఇబ్బందుల వల్ల సర్వే కుంటుపడిందన్నారు ఉప్పలంచ, భైరవునిబండ, బండ మీదిగూడెం, జాలోని గూడెంలో సర్వే పూర్తయిందని తెలిపారు. ఈ నెల 31 లోపు సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మాన్యా నాయక్, తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీవో అల్లూరి పద్మ, ఆర్‌ఐమహ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : ఎమ్మెల్యే సామేల్


శాలిగౌరారంలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 106 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. అనంతరం శాలిగౌరారంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాలన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి,ఎంపీవో పద్మ, డిప్యూటీ తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, ఆర్‌ఐ అజారుద్దీన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, గూని వెంకటయ్య, చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్ గౌడ్, నోముల జనార్దన్, కట్టగూరి సురేందర్ రెడి యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొల్లికొండ గణేష్, బొడ్డు నగేష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు షురూ


నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల మరియరాణి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ మత పెద్దలు

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలు బుధవారం క్రైస్తవులు జరుపుకోనున్నారు. ఇప్పటికే దైవ కుమారుడి జన్మదినం పురస్కరించుకొని క్రైస్తవులు వారం రోజుల నుంచి ప్రార్థనలు బైబిల్ పఠనాల, సందేశాలతో చర్చిలన్నీ సందడిగా మారాయి. పాస్టర్లు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చి, దేవరకొండ రోడ్డులోని మరియరాణి కెథ్రిడల్ చర్చితో పాటు పట్టణంలోని సుమారు 40 చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి ఏసుక్రీస్తు జననం సందర్భంగా వేడుకలను జరిపారు. చర్చిలన్నీ భక్తులతో సందడిగా మారాయి. ప్రముఖల చేతుల మీదుగా క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి ఏసు జననాన్ని స్వాగతం పలికారు.

చర్చీల ముస్తాబు

మునుగోడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మగూడెం చర్చి (యేసునామకరణ దేవాలయం) క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ప్రత్యేక ప్రార్థనల కోసం పశువుల పాకను వివిధ చోట్ల ఏర్పాటు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తూ చేసే పనులు ప్రత్యేక ఆకర్షణగా తీర్చి దిద్దుకుం టున్నాయి. ఈవేడుకల అనంతరం 8వ రోజున పురస్క రించు కొని ఊరిపండగ (జాతర)ను వైభవంగా నిర్వహించేందుకు క్రైస్తవులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామంలో క్రైస్తవులు తమ ఇళ్లను శుభ్రం చేసుకొని రంగులు వేసుకునే స్టార్‌ల ఏర్పాటు వంటి వివిధ పనులు ప్రస్తుత చర్చి విచారణ గురువు ఫాదర్ ధనరాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.

● శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగమర్తి, ఇటుకులపహాడ్, అంబారిపేట, ఆకారం, అడ్లూర్, శాలిగౌరారంలోని పలు చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. అన్ని చర్చీలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చండూరు, నాంపల్లి (ఆంధ్రజ్యోతి) : చండూరు, నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ పాఠశాలల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాంతా క్లాజ్ వేషధారణలో ఉన్న విద్యార్థులు కేక్ కట్ చేసి చాక్లెట్లను విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు డైరెక్టర్ సరి కొండ వెంకన్న, ప్రిన్సిపల్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, నాంపల్లిలో పాఠశాల డైరెక్టర్లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శాలిగౌరారం: ఆకారంలో విద్యుత్ వెలుగుల్లో చర్చి

యువత క్రీడల్లో రాణించాలి : మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి


పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఏర్పా టు చేసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాములునాయక్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, హైదరాబాద్ ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ కుంభం రాం రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్, ఎం.శ్రీనివాసులు, ఐలయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎంజిల్లా కార్యదర్శి వీరారెడ్డి

కట్టంగూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కట్టంగూర్‌లో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్‌షా అవహేళనగా మాట్లాడటం యావత్ దేశ ప్రజలందరిని అవమానపర్చడమే అన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, చిలుముల రామస్వామి, మురారి మోహన్, ఇటుకల సురేదర్, కట్ట బక్కయ్య, జాల రమేష్, ఉట్కూరు యాదయ్య, కొండూరు సత్తయ్య గడగోజు రవీంద్రాచారి, సుజాత, ఆంజనేయులు ఉన్నారు.

• హ్యాపీ హ్యాపీ క్రిస్మస్



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చీలన్నీ ముస్తాబయ్యాయి. ఏసు రాకను ఆహ్వానిస్తూ మంగళవారం రాత్రి నుంచే చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

8

ఎన్నికలేనా?



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో చేసిన మార్పులతో త్వరలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీ ఎన్నికల కోసం పలు సవరణలు ప్రతిపాదించ గా, చట్ట సవరణ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. ఇక గవర్నర్ ఆమోదం తెలిపితే కొత్త చట్టం అమలులోకి రానుంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న నేతల్లో అలజడి మొదలైంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి, మోత్కూరు)

» పంచాయతీరాజ్ నూతన చట్టాన్ని ప్రతిపాదించిన ప్రభుత్వం » గవర్నర్ ఆమోదమే తరువాయి » స్థానిక సంస్థల్లో మారనున్న రిజర్వేషన్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 71 మండలాలు, 1745 పంచాయతీలు, 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 31 మం డలాలు, 844 పంచాయతీలు, ఎనిమిది మునిసిపాలిటీలు ఉన్నా యి. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు, 475 పంచాయతీలు, ఐదు మునిసిపాలిటీలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 17 మండలా లు, 426 పంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. త్వరలో మునిసిపాలిటీల పదవీకాలం కూడా పూర్తికానుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రకటించడంతోపాటు ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేసేందుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసేందుకు రాష్ట్ర ఎన్నికల సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం సైతం తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహించి, మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.

పదేళ్ల రిజర్వేషన్ లేనట్టే

బీఆర్ఎస్ సర్కారు రూపొందించిన 2018-పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థాని క సంస్థలైన పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల్లో పదేళ్లపాటు (రెండు పర్యాయాలు) ఒకే రిజర్వేషన్ ఉండాలని నిబంధన విధించింది. అయితే, తాజా కాంగ్రెస్ రూపొందించి న చట్టం ప్రకారం పదేళ్ల నిబంధనను ఐదేళ్లకు మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చాలా మం ది నేతలు స్థానికసంస్థల్లో మరోసారి పోటీ చేయాలని ఆ పార్టీలోకి వలసబాట పట్టారు. అయితే ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రిజర్వేషన్లు మారనున్నాయి. దీం తో ఏగ్రామం, మండలంలో ఏ రిజర్వేష న్లు అమలవుతాయోనని నేతలు ఉత్కంఠగా ఉన్నారు.

మండలానికి ఐదు ఎంపీటీసీ స్థానాలు

ప్రతీ మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ స్థానాలు కేటాయించడం తో కొన్ని మండలాల్లో ముగ్గురు, నలుగురే ఎం పీటీసీలు ఉన్నారు. నూతన చట్టం ప్రకారం జనాభాతో సంబంధం లేకుం డా ప్రతీ మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలని ప్రభు త్వం ప్రతిపాదించింది. ఈ నిర్ణయంతో మోత్కూరు మండలంలో ఒక ఎంపీటీసీ స్థానం పెరగనుంది. 2018లో అడ్డగూడూరు మండలం ఏర్పాటు కావడం, మోత్కూరు మునిసిపాలిటీ కావడంతో మోత్కూరు మండలంలో

- మిగతా 7వ పేజీలో...

పట్టణీకరణకు అనుగుణంగా
పాఠశాలలను విస్తరించాలి

» వచ్చే ఏడాది నుంచి ప్రీప్రైమరీ స్కూళ్లను ప్రారంభించాలి
» నోడిటెన్షన్‌ను రద్దు చేయడం కేంద్రం తప్పుడు నిర్ణయమే
» 'ఆంధ్రజ్యోతి'తో శాసనమండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి



తెలంగాణలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది.. అందుకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.. ప్రభుత్వ విద్యాబలోపేతంతోనే అన్నివర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది.. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.. ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి విద్యాక మిషన్ సరైన మార్గదర్శకాలు అందిస్తుందని భావిస్తున్నా.. అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. అందుకు అనుగుణంగా పట్టణాలు,నగరాల్లో ప్రభుత్వ స్కూళ్లను విస్తరించాలి. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో 1.20లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, ములుగు జిల్లా అంతా కలిపినా లక్ష మందికి లోబడి మాత్రమే ఉన్నారు. అదేవిధంగా గ్రేటర్ వరంగల్, అన్ని కార్పొరేషన్లు, జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. గ్రామాల్లో వృద్ధులు మాత్రమే ఉంటున్న పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఈ మార్పును దృష్టిలో ఉంచుకొని పట్టణాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ స్కూళ్లను అదనంగా ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వరంగంలో అంగన్‌వాడీ కేంద్రాలున్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో అక్కడికంటే ప్లేస్కూళ్లకే పిల్లలను పంపుతున్నారు. ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని మేం ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

నోడిటెన్షన్ విధానం రద్దు సరికాదు

కేంద్రం తాజాగా ఇచ్చిన నోడిటెన్షన్ గెజిట్ ఇప్పుడు అవసరం లేదు. 5, 8 తరగతుల విద్యార్థులు చదువులో వెనకబడితే పరీక్షల్లో ఫెయిలయితే, ఆ విద్యార్థులపై తదుపరి తరగతిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగుపడేలా బోధన ఉండాలే తప్ప ఒత్తిడి పెంచేలా డిటెన్షన్ అమలు చేస్తామనడం అసంబద్ధ చర్య. కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంగా దీన్ని పరిగణించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అమలుచేస్తున్నట్లే నోడిటెన్షన్ విధానమే కొనసాగించాలి.

కనీసం 15మంది విద్యార్థులకు తగ్గకుండా తరగతి గది

పిల్లలకు సమవయస్కులు కనీసం 15మంది ఉంటేనే వారు చదువు నేర్చుకోవడం సులభంగా ఉంటుంది. ఉపాధ్యాయుల

- మిగతా 7వ పేజీలో...

రెవెన్యూ సమస్యలు వెంటనే
పరిష్కరించాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



చందంపేట మండలం గాగిళ్లపురంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

దేవరకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, భూసేకరణతోపాటు రెవెన్యూ సమస్యలు జాప్యం చేయకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. మంగళవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి' ఫిర్యాదులు, భూసేకరణకు సంబంధించిన సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డివిజన్ పరిధిలోని నక్కలగండి, పెండ్లిపాకల, ఓపెన్‌కెనాల్, డిండి రిజర్వాయర్ పనులకు భూసేకరణ, పునరావాసం వివరాలను ఆర్డీవో రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, 'ప్రజావాణి' ఫిర్యాదులను ఆమె సమీక్షించారు.

సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, చందంపేట): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించి అర్హులను గుర్తించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం చందంపేట మండలంలోని గాగిళ్లపురం, మురుపునూతల, పాతూరుతండా గ్రామాల్లో సర్వేను ఆమె తనిఖీ చేశారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదుకు యాప్‌లో నెట్‌వర్క్ సమస్య వస్తోందని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నెట్‌వర్క్ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో శ్రీలక్ష్మీ, తదితరులు ఉన్నారు.

సత్వర న్యాయం అందించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ కిట్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమర్థ సేవలతో ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేసి మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాధాన్యం, డయల్ 100, సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీరోజు డ్రంకెడ్రైవ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేసి నేరాల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలనీ, హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్, లాకప్, ఎస్‌హెచ్‌వో గది, రికార్డులను, నూతనంగా విధుల్లో చేరిన పోలీసులకు ట్రైనింగ్‌లో ఇచ్చిన కిట్‌లను తనిఖీచేశారు. ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండలో చెక్కులు పంపిణీచేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, చిట్యాలరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 39మంది నిరుపేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైనా రూ.13,96,000లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో సైతం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు.

ఫటాఫట్ FATAFAT

'దేవరకొండ'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఆలంపల్లి నర్సింహ, మునిసిపల్ చైర్మన్, దేవరకొండ



దేవరకొండ మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో మునిసిపాలిటీలో సమస్యలన్నింటినీ కృషి చేస్తున్నట్లు దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ మంగళవారం "ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.
- (దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ మునిసిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు?

చైర్మన్: దేవరకొండ మునిసిపాలిటీలో 20 వార్డులున్నాయి. రూ.30కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఖిల్లాలోని పార్కులను పూర్తి చేశాం. దేవరకొండ పట్టణంలో రూ.30 కోట్లతో రోడ్ల పనులు ప్రారంభించాం. మరో రూ.20 కోట్లు రోడ్లకు ప్రతిపాదనలు పంపించాం.

ఆంధ్రజ్యోతి: మునిసిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

చైర్మన్: దేవరకొండ పట్టణానికి రోజు విడిచి రోజు 40లక్షల లీటర్ల మిషన్‌భగీరథ నీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం అన్ని కాలనీలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నాం. ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో కోదండాపురం ప్లాంట్ నుంచి దేవరకొండకు తాగునీటి కోసం రూ.50కోట్ల ప్రతిపాదనలు పంపించాం. పట్టణానికి మరో 10 లక్షల లీటర్ల నీరు అవసరం.

ఆంధ్రజ్యోతి: దేవరకొండ పట్టణంలో మార్కెట్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

చైర్మన్: సమీకృత మార్కెట్ మంజూరైంది. స్థల సేకరణలో జాప్యం జరగడంతో నిలిచిపోయింది. మంత్రులు, ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో త్వరలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

చైర్మన్: పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. పట్టణంలోని 8,500 ఇళ్లకు తడి, పొడి చెత్త వేయడానికి రెండు బుట్టలు పంపిణీ చేశాం. డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశాం. ప్రజలు చెత్తను రోడ్డుపై వేయకుండా అవగాహన కల్పిస్తున్నాం.

ఆపదొస్తే ఆమడదూరం వెళ్లాల్సిందే

● జిల్లా సరిహద్దులో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ● వైద్యశాల నుంచి 20 కిలోమీటర్ల దూరంలో గ్రామాలు ● మారుమూల గ్రామ ప్రజలకు అందని వైద్యసేవలు



డిండి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల

డిండి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో ఉన్న డిండి ప్రాథమిక వైద్యశాల సేవలు మారుమూల గ్రామాల ప్రజలకు అందడంలేదు. ప్రాథమిక వైద్యశాలకు 20 కిలోమీటర్ల దూరంలో మండలంలోని గ్రామాలు విస్తరించి ఉండడంతో స్థానికులు వైద్యసేవలు వినియోగించుకోలేకపోతున్నారు. మండల పరిధిలో 35 గ్రామపంచాయతీలుండగా సమీపంలో ఉన్న 7, 8 గ్రామాలకు చెందిన ప్రజలు మాత్రమే చికిత్సకోసం ఆసుపత్రికి వస్తుంటారు. ప్రాథమిక వైద్యశాలకు ఒకవైపు మండలంలోని గ్రామాలన్నీ విస్తరించి ఉండడంతో అత్యవసర సమయాల్లో సరైన సౌకర్యాలులేక వ్యాధుల బారిన పడినవారు ఆసుపత్రికి చేరుకోలేక సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. డిండి ప్రాథమిక వైద్యశాల పరిధిలో 11 సబ్‌సెంటర్లుండగా ప్రతీ సబ్‌సెంటర్‌కు ఇద్దరు ఏఎన్‌ఎంలను నియమించాలి. కానీ ఒక్క ఏఎన్‌ఎం మాత్రమే విధులు నిర్వర్తిస్తూ ఉండడంతో మెరుగైన సేవలు గ్రామీణ ప్రజలకు అందడంలేదు. ఆసుపత్రికి సిబ్బంది కొరత కొంతకాలంగా వెంటాడుతుంది. మండలకేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రహ్మణపల్లి, ఎర్రగుంటపల్లి, కందుకూరు, డి.నెమలిపూర్, ఎర్రారం, కామేపల్లి, గోనబోయినపల్లి, ప్రతాప్‌నగర్, వావిల్‌కోల్, టి.గౌరారం, దేవత్‌పల్లి గ్రామపంచాయతీలకు వైద్యసేవలు అందడంలేదు. మండలంలో అత్యధిక గిరిజనులు ఉన్న డిండి మండలానికి మరో ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 50వేల జనాభా ఉన్న మండలంలో ఒకే ప్రాథమిక వైద్యశాల ఉండడంవల్ల మెరుగైన వైద్యసేవలు అందడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రిని 30 పడకల స్థాయికి పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేయాలి



చెర్కుపల్లి గ్రామంలో నూతనంగా ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేయాలి. ఈ వైద్యశాల ఏర్పాటుతో పరిసరాల్లోని గిరిజనులకు వైద్యసేవలు చేరువవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేసి అత్యవసర సమయాల్లో తగిన వైద్యం అందించాలి.
బత్తిని శ్రీనివాసరెడ్డి, చెర్కుపల్లి

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

చింతపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రాంత ప్రచారక్ కార్యదర్శి కోటగిరి సంతోష్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం గొడుకొండ్ల రిజర్వాయర్ ఎదుట అయ్యప్ప దేవాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి కన్వీనర్ కనిగిరి గోవర్ధన్, సందపట్ల రాజేష్‌సాగర్, గుర్రం వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేములపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన గుణగంటి వెంకన్నగౌడ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి మంగళవారం వెంకన్న కుటుంబాన్ని పరామర్శించి రూ.6వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మార్కెట్‌యార్డులో మౌలిక వసతులు కల్పించాలి



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవంతీపురం మార్కెట్ యార్డులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం సంత సందర్భంగా ఆయన మార్కెట్‌యార్డుకు వచ్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌యార్డులోని మౌలిక వసతులు, ధాన్యం గోదాం, మార్కెట్‌యార్డును పరిశీలించారు. అనంతరం రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యం తడిసినా, మొలకెత్తినా కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలన్నారు. ఆయనవెంట నాయకులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి ● ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కొండమల్లేపల్లి, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రవి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లతో డివిజన్‌స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఓపీ సేవలు, రక్త పరీక్షలు, టీబీ కేసులతోపాటు పలు అంశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కల్యాణ్‌చక్రవర్తి, కృష్ణకుమారి, ఉషారాణి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

● పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం ● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



హాలియాలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల శ్రేయస్సుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియాలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి మాట్లాడుతూ ఏడాదికాలంగా రాష్ట్రంలో కాంగ్రెస్ కులమత బేధాలు లేకుండా అన్ని వర్గాల అభ్యున్నతికోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతోందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని, సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 66 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, తహసీల్దార్ రఘు, మునిసిపల్ చైర్‌పర్సన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, నందికొండ రామేశ్వరీ మట్టారెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, వెంపటి శ్రీనివాస్, ధనావత్ భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. మంగళవారం హాలియాలోని క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నూతన సబ్‌స్టేషన్లు, విద్యుత్ సమస్యల దృష్ట్యా ప్రభుత్వం ద్వారా రూ.16కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ తిరుపతయ్య, ఏఈలు ధన్‌రాజ్‌కుమార్, శరత్, తాసయ్య, శేఖర్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పెద్దవూర, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 116 మంది కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.1,16,13,456 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, తిరుమలగిరి(సాగర్) మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, తహసీల్దార్ ఎస్.సరోజ, ఎంపీవో సుధీర్ కుమార్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, పబ్బు యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తోందని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలానికి 99 కల్యాణలక్ష్మీ చెక్కులు మంజూరు కాగా లబ్ధదారులకు అందజేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, మాజీ ఎంపీటీసీలు హచ్చునాయక్, సేవానాయక్, శౌరీనాయక్, రూప్‌సింగ్, మునినాయక్, భద్రినాయక్, హరినాయక్, సాయి, బిక్కునాయక్, బిచ్చాలు, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో ముసురు

దేవరకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మంగళవారం సాయంత్రం నుంచి ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో డిండి, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులతోపాటు మండలంలోని రైతులు బోరుబావుల వద్ద వరి సాగు చేసుకున్నారు. పంటచేతికొచ్చి ఐకేపీ కేంద్రాలకు తరలించటంతోపాటు మరికొంత మంది రైతుల ధాన్యం కల్లాల్లో ఉంది. తుఫానుతో కూడిన అకాల వర్షం కురుస్తుండటంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసభ్యకరంగా మాట్లాడిన వారిపై చర్య తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న సిబ్బందిని బూతులు తిట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని కోరుతూ మునిసిపల్ ఉద్యోగులు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఉద్యోగి రంగారావు మాట్లాడుతూ పట్టణంలోని బంగారుగడ్డలో వివరాలు సేకరిస్తుండగా కాలనీకి చెందిన వ్యక్తి (షేక్ ఆరీఫ్) తమను బూతులు తిట్టాడని తెలిపారు. తనతో పాటు విధుల్లో పాల్గొన్న ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దుర్భాషలాడుతూ కించపరిచాడని తెలిపాడు. మాలధారణ స్వాములున్నప్పటికీ విచక్షణ కోల్పోయాడని పేర్కొన్నారు. ప్రజలందరి సమక్షంలో దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తిరుమల్లేష్, సైదులు, మల్లేష్, మౌలానా, రమేష్, ప్రసాద్, యాదగిరి, ఎల్లయ్య ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలరాజురెడ్డి

కొండమల్లేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నల్లగొం డ రోడ్డులోని పాత ఊరిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో బాలరాజురెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి డాకూనాయక్, సిబ్బంది రాంరెడ్డి, లక్ష్మణ్ కాంగ్రెస్ నాయకులు కైసర్‌ఖాన్, బూడిద మల్లేష్‌యాదవ్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిబాబు అన్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెంలో గల సర్వే నంబర్ 14లో 1.8ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించి మంగళవారం బోర్డును ఏర్పాటు చేశారు. ఎవరైనా ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, బోర్డును తొలగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



దేవరకొండలో బస్సుజాతనుద్దేశించి మాట్లాడుతున్న భూపాల్

దేవరకొండ, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరుగనున్న బడ్జెట్ సమావేశాల్లో రూ.18వేలు కనీస వేతనం బిల్లు పెట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, ఆశ బస్సుజాత రథసారధి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మీలు డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న రాష్ట్ర బస్సుజాత మం గళవారం దేవరకొండకు చేరుకుంది. దేవరకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కె.చంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆశయూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరి, వెంకటమ్మ, నల్ల వెంకటయ్య, బిజిలి లింగయ్య, జ్యోతి, బుడిగె వెంకటేష్, పాల్గొన్నారు.

మాదిగ మహాకూటమి గ్రామ కమిటీల నియామకం

నేరేడుగొమ్ము, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాదిగ మహాకూటమి ఆధ్వర్యంలో గ్రామకమిటీలను నియమించినట్లు నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి పొట్టిపాక మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ కోకాల కిరణ్ ఆదేశాలమేరకు గ్రామకమిటీలు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాదిగల రాజ్యాధికారమే లక్ష్యంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా ముందుకు వెళ్తున్నన్నట్లు ఆయనవివరించారు. కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడిగా శ్రీను, ఉపాధ్యక్షుడిగా దూదిపాల వెంకటయ్య, కార్యదర్శిగా రవి, సహాయ కార్యదర్శిగా ముత్యాలు, నేరేడుగొమ్ము కమిటి అధ్యక్షుడిగా గాదెపాక నాగార్జున, ఉపాధ్యక్షులుగా మారేపల్లి నాగార్జున, పెద్దమునిగల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జిల్లా శ్రీనయ్య, ఉపాధ్యక్షుడుగా ఆడెపు రవి, కార్యదర్శిగా హరికృష్ణ, సహాయకార్యదర్శిగా కుక్కముడు జగన్‌ను ఎన్నిక చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సుధాకర్, లింగయ్య, సభ్యులు పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు




విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎం రమేష్‌బాబు

దేవరకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రతి 15 రోజులకు ఒక్కసారి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేస్తున్నట్లు ఆర్టీసీ దేవరకొండ డీఎం రమేష్‌బాబు తెలిపారు. దేవరకొండ డిపోలో మంగళవారం లక్కీడ్రా ద్వారా ముగ్గురు మహిళ ప్రయాణికులను ఎంపికచేసి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. హైదరాబాద్ గ్రీన్‌పార్కుకు చెందిన సుజాతకు ప్రథమ బహుమతి, నల్లగొండకు చెందిన షకిలకు ద్వితీయ బహుమతి, ఫకీర్‌పూర్ గ్రామానికి చెందిన మల్లమ్మకు తృతీయ బహుమతి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్‌రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ చింతపల్లి 35వ బూత్ అధ్యక్షుడిగా అభినవ్

చింతపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం 35వ బూత్ అధ్యక్షుడిగా గజ్జె అభినవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, కుక్కుడపు రామకృష్ణ, వెన్నం శేఖర్, ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధల నడుమ సెమీ క్రిస్మస్



చింతపల్లి బచ్‌పన్ స్కూల్‌లో..

నిడమనూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో చర్చీలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఏసు క్రీస్తు పుట్టినరోజున క్రైస్తవ సోదరులు క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకునేందుకు మండలంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లోని చర్చీలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రీస్తు జననాన్ని తెలియజేసే చిత్రపటాలను ప్రదర్శించారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు శాంతాక్లాజ్ బొమ్మలు, నక్షత్రాలు, క్రిస్మస్ చెట్లతో ఇళ్లను ఆకర్షణీయంగా అలంకరించుకున్నారు. మండలకేంద్రంలోని లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కందగంట్ల ధన్వంతరిబాబు కేక్ కట్ చేశారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఆదిత్య ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ తాత, శాంతాక్లాజ్, ఏసు క్రీస్తు తదితర వేషాధారణలతో అలరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పండుగలు, వాటి విశిష్టతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శాంతి స్వభావానికి ప్రతిరూపమైన క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వేషాధారణతో అలరించిన విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత పాల్గొన్నారు.

బచ్‌పన్ స్కూల్‌లో..

చింతపల్లి: మాల్ బచ్‌పన్ స్కూల్‌లో మంగళవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టరు వినోద్‌కుమార్, బాబీజీ, శిరీష పాల్గొన్నారు.



మిర్యాలగూడలోని ఆదిత్య పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



నిడమనూరులో లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో కేక్ కట్ చేసి కేరింతలు కొడుతున్న చిన్నారులు